# జోరుగా బీఆర్ఎస్ ప్రచారం

- ఇంటింటికీ వెళ్లి పథకాలపై అవగాహన కల్పిస్తున్న గులాబీ శ్రేణులు
- కారుగుర్తుకు ఓటేసి రసమయిని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి



మానకొండూర్: మండల కేంద్రంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓటు అభ్యర్థిస్తున్న యూత్ నాయకులు

మానకొండూర్, నవంబర్ 11: మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణుల ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతున్నది. శనివారం యూత్ నాయకులు రాజీవ్‌నగర్, సంజీవ్‌నగర్ కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, వాటి వల్ల కలిగిన లబ్ధిని ప్రజలకు వివరించారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోపై అవగాహన కల్పిస్తూ మానకొండూర్ ఎమ్మెల్యే బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఉండింటి శ్యాంసన్, గంజి శ్రీనివాస్, బొల్లం నారాయణ, గూడ రమేశ్, ఉండింటి ప్రశాంత్, అభిషేక్, బొల్లం శ్రావణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**గ్రామాల్లో..**

మానకొండూర్ రూరల్, నవంబర్ 11: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని సదాశివపల్లి, మండలంలోని శ్రీనివాస్‌నగర్, గంగిపల్లి, ముంజంపల్లి, వన్నారం, వెల్ది, అన్నారం, వేగురుపల్లి, కొండపల్కల గ్రామాల్లో శనివారం బీఆర్ఎస్ ప్రచారం ముమ్మరంగా సాగింది. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లిన నాయకులు, కార్యకర్తలు, బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలను ప్రజలకు వివరించారు. కారుగుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ రసమయి బాలకిషన్‌కు హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల నేతలు, మహిళా నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**గన్నేరువరంలో..**

గన్నేరువరం, నవంబర్11: మండలంలోని జంగపల్లి గ్రామంలో బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తరపున పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ఓటర్ల వద్దకు వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులు, మ్యానిఫెస్టోలోని అంశాలను వివరించారు. కారు గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా రసమయి బాలకిషన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన నాయకులు పాల్గొన్నారు.



మానకొండూర్ రూరల్: కొండపల్కలలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



గన్నేరువరం: జంగపల్లిలో కరపత్రాలను పంచుతూ ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు



గన్నేరువరం: ఖాసీంపేట మానసా దేవి ఆలయంలో రాజశ్యామల యాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే

## రసమయి గెలువాలని రాజశ్యామల యాగం

గన్నేరువరం, నవంబర్ 11: మానకొండూర్ ఎమ్మెల్యేగా రసమయి బాలకిషన్ హ్యాట్రిక్ విజయం సాధించాలని మండలంలోని ఖాసీంపేట స్వయంభూ మానసాదేవి ఆలయంలో శనివారం బీఆర్ఎస్ నాయకులు రాజశ్యామల యాగం నిర్వహించారు. యాగంలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో తప్పకుండా మూడోసారి, మానకొండూర్ నియోజకవర్గానికి సేవ చేసే భాగ్యం దక్కుతుందన్నారు. పూజల్లో జడ్పీటీసీ రవీందర్ రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు వెంకన్న, నాయకులు మోహన్ రెడ్డి, ఆంజనేయులు, చంద్రారెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

**తిరుమలలో పూజలు..**

తిమ్మాపూర్, నవంబర్ 11: మానకొండూర్ ఎమ్మెల్యేగా రసమయి బాలకిషన్ మూడోసారి హ్యాట్రిక్ విజయం సాధించాలని మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు పారునంది జలపతి, కిన్నెర అంజి, తూర్పాటి అజయ్, ఇనుకొండ సంపత్ శనివారం తిరుపతికి వెళ్లి వేంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గాన్ని ఎంతగానో అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ గెలుపు కోసం స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు.



తిమ్మాపూర్: తిరుమలలో బీఆర్ఎస్ నాయకులు

# నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు తప్పవు

- ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలి
- ఏసీపీ కరుణాకర్ రావు



మాట్లాడుతున్న ఏసీపీ కరుణాకర్ రావు



కవాతు చేస్తున్న జవాన్లు

తిమ్మాపూర్, నవంబర్ 11: ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని, లేకపోతే కేసులు తప్పవని కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్ రావు హెచ్చరించారు. శనివారం ఉదయం తిమ్మాపూర్ మండల కేంద్రంలో బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సంజయ్ కుమార్, జవాన్లతో కలిసి కవాతు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజలను ఉద్దేశించి ఏసీపీ మాట్లాడారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరుగాల్సిన అవసరం ఉందని, ప్రతి పౌరుడూ తన ఓటును స్వేచ్ఛగా వినియోగించుకునేలా చూడాలన్నారు. ప్రచార నిర్వహణకు అనుమతి తీసుకోవాలని పార్టీ నాయకులకు సూచించారు. కార్యక్రమంలో సీఐలు రాజ్ కుమార్, ఇంద్రసేనారెడ్డి, రవీందర్, ఎస్సైలు ప్రమోద్ రెడ్డి, నర్సింగరావు, శ్రీకాంత్, రాజేశ్, సర్పంచ్ దుండ్ర నీలమ్మారాజయ్య, బీఎస్ఎఫ్ కమాండర్స్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



ముల్కనూర్ ఉప కేంద్రంలో రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో లలితాదేవి

చిగురుమామిడి, నవంబర్ 11: మండలంలోని చిగురుమామిడి, చిన్నముల్కనూర్, బొమ్మనపల్లి ఆరోగ్య కేంద్రాలను జిల్లా వైద్యాధికారి లలితాదేవి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదటగా చిన్న ముల్కనూర్ ఆరోగ్య ఉప కేంద్రానికి వచ్చిన జిల్లా వైద్యాధికారి.. గర్భిణులను పరీక్షించి, పలు రిజిష్టర్లను పరిశీలించారు. సాధారణ కాన్పులపై గర్భిణులకు అవగాహన కల్పించాలని, ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలను పెంచాలని సిబ్బందికి సూచించారు. చిగురుమామిడి గ్రామ పంచాయతీలో బాలింతలు, గర్భిణులకు ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. బొమ్మనపల్లిలోని ఆరోగ్య ఉప కేంద్రంలో అసంక్రమిత వ్యాధుల వైద్య శిబిరాన్ని సందర్శించారు. ప్రతి రోజూ బీపీ, షుగర్ మాత్రలను వాడాలని రోగులకు సూచించారు. రోగ నిర్ధారణకు సంబంధించిన అన్ని పరీక్షలు ఆరోగ్య ఉప కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మద్యపానం, గుట్కా నమలడం, ధూమపానం వంటి అలవాట్లను మానుకోవాలని, రోజూ విధిగా వ్యాయామం, యోగా చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి ధర్మానాయక్, పల్లె దవాఖాన వైద్యులు డా. కార్తీక్, డా. మాధురి, డీపీవో రవీందర్, హెచ్‌ఈవో బాలయ్య, ఎన్సీడీ కోఆర్డినేటర్ పోచయ్య, శ్రీనివాస్, సూపర్‌వైజర్ హాజి బాబా, పద్మ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## దహన సంస్కారాలకు విరాళం

మానకొండూర్ రూరల్, నవంబర్ 11: మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన కనకం లక్ష్మి శుక్రవారం రాత్రి మృతి చెందగా, శనివారం బాధిత కుటుంబాన్ని 'మేము సైతం గ్రామ సేవకై' ఫౌండేషన్ సభ్యులు పరామర్శించారు. లక్ష్మి దహన సంస్కారాల కోసం రూ. 5 వేల నగదు అందజేశారు. ఫౌండేషన్ సభ్యులను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో గ్రామ యువకులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా ముందస్తు దీపావళి వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

హుజూరాబాద్ రూరల్, నవంబర్ 11: మండలంలోని తుమ్మనపల్లి గ్రామ శివారులోని ఏకశిల సీబీఎస్ఈ పాఠశాలలో శనివారం ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులంతా ఎకో ఫ్రెండ్లీ దీపావళిని జరుపుకోవాలని సూచించారు. పర్యావరణానికి హాని కలిగించే పటాకులను కాల్చవద్దన్నారు. ముందస్తుగా దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సీహెచ్ దినేశ్ రెడ్డి, ప్రిన్సిపాల్ బీ లక్ష్మణ్, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్మయి, స్టాఫ్ ఇన్‌చార్జి దూడల నరేశ్ , విద్యార్థినీవిద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

తిమ్మాపూర్ రూరల్, నవంబర్ 11: అక్రమంగా మద్యం తరలిస్తే ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తిమ్మాపూర్ సర్కిల్ ఎక్సైజ్ సీఐ ఇంద్రప్రసాద్ హెచ్చరించారు. గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి గ్రామ శివారులో శుక్రవారం రాత్రి వాహనాల తనిఖీలో శివకుమార్ అనే వ్యక్తి అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు గుర్తించి, 26 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని, బైక్ సీజ్ చేసి, కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని, ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మినా, నిలువ చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో ఎస్ఐలు శ్రీకాంత్, సరిత, హెడ్ కానిస్టేబుల్ రాజేశం, సిబ్బంది నరేశ్, కొండల్ రెడ్డి, సురేశ్, రజిత పాల్గొన్నారు.